
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

సోమవారం 21 ఏప్రిల్ 2025

కారణ జన్ముడు చంద్రబాబు



విభిన్న ప్రతిభావంతులతో ఎమ్మెల్యే కందికుంట

కదిరి(ఆంధ్రజ్యోతి): కారణ జన్ముడు ముఖ్యమంత్రి నారా చంద్రాబునాయుడు అని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మొటుకుపల్లి ఆర్డీటీ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల మధ్య కేక్ కట్ చేసి, వారికి పంచారు. దుస్తులు పంపిణీ చేశారు. రూ.లక్ష విరాళాన్ని నిర్వాహకులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఆయన జన్మదినం విభిన్న ప్రతిభావంతుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

పురంలో ఘనంగా..

హిందూపురం(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కేక్ కట్‌చేసి, టపాసులు పేల్చారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద శిబిరంలో 75మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

వాడవాడలా వేడుకలు



రోగులకు పాలు, బ్రెడ్డు అందిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలను ఆదివారం వాడవాడలా నిర్వహించారు. కేక్ కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉపాధి కల్పించడం చంద్రబాబుకే తెలుసు..

సామాన్య, మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి యువతకు మహిళకు రైతులకు ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న విషయాలు తెలిసిన ఆర్థిక వేత్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత కొనియాడారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి కేక్ కట్ చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి, నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రతిక్షణం ప్రజా సంక్షేమం కోసం పాటుపడతారన్నారు.



హిందూపురం ఎన్టీఆర్ సర్కిల్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే అభివృద్ధి



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబుతోనే సాధ్యమని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన భారీ కేక్ కట్‌చేశారు. ఎంపీ మాట్లాడుతూ.. చంద్రబాబు నిండు నూరేళ్ల జీవించాలన్నారు.

పుట్టపర్తిలో..

పుట్టపర్తిరూరల్(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కేక్ కట్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు, కమ్మవారి పల్ల రోడ్డులోని సాయిఅనుగ్రహ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, బ్రెడ్లు, పండ్లు అందజేశారు.



హోమం చేస్తున్న మాజీ మంత్రి పల్లె

వరికి మద్దతు ధర కల్పించాలి



వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

బుక్కపట్నం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాలో అత్యధికంగా రైతులు సాగు చేసే వరికి మద్దతు ధర కల్పించాలని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని వరి ధాన్యాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. బుక్కపట్నం చెరువు కింద దాదాపు మూడు వేల ఎకరాల్లో వరి సాగుచేశారని, వరికొనుగోలు కేంద్రాలు లేక పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. వరి పంట అమ్మే సయమానికి దళారులు కుమ్మక్కై గిట్టుబాటు ధరలు లేకుండా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఆయన వెంట నాయకులు ముత్యాలు, వెంకటేష్, బేళ్ల ఆంజి ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. తనతోపాటు అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

పండుగ వచ్చిందే..!

- మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్ విడుదల ● గత ఐదేళ్లూ నీరుగార్చిన జగన్ ● మాట ఇచ్చినట్టే అమలు చేసిన కొత్త ప్రభుత్వం ● ఉమ్మడి జిల్లాలో 811 పోస్టులు ● నిరుద్యోగులు, ఆశావహుల్లో ఆనందం ● మే 15 వరకూ దరఖాస్తులు... జూన్ 6 నుంచి పరీక్షలు

7

ఏడ ఎతకాలి.. నీటి జాడ..?



చెత్తకుప్పలో గాలిస్తున్న వానరం

ఎండ మండిపోతోంది..
దాహం దహించేస్తోంది..
నాలుక తడారిపోతోంది..
గొంతు ఎండిపోతోంది..

అడవిలో నీటి చుక్క లేదని..
ఊరిలోకొస్తే..
కసురుకునేవారే తప్ప..
కాసింత కరుణ చూపే వారు లేరు..
కోతి వచ్చిందని.. తరిమే వారే తప్ప..
గొంతు తడిపేవారు లేరు..

తిరిగి.. తిరిగి.. వెతికి.. వెతికి..
ఆస్పత్రి పక్కన మందుల కుప్పను
చూసింది..
ఖాళీ సెలైన్ బాటిల్ తీసుకుని..
పెద్ద యుద్ధమే చేసింది..
ఒకట్రెండు బొట్లు ద్రావకం వచ్చింది..
దాంతో నాలుక తడుపుకుని..
వెళ్లిపోయింది.. నీటి వేట కొనసాగిస్తూ..

అంతలా కష్టపడినా..
గొంతు కూడా
తడవలేదు..
వేసవిలో మూగజీవాల
దీన స్థితి ఇది..
వాటి కోసం కాసిన్ని నీళ్లు పెడదాం..
ప్రాణాలు నిలుపుదాం..

కొత్తచెరువులోని ధర్మవరం రహదారి పక్కన చిన్నపిల్లల ఆస్పత్రి ఎదుట ఓ వానరం గురువారం నీటి కోసం తిప్పలు పడుతూ కనిపించింది. చెత్తకుప్పను గాలించింది. అందులో సెలైన్ బాటిల్ దొరకడంతో అందులోని ద్రావణాన్ని తాగి, దప్పిక తీర్చుకునేందుకు వానరం పడిన కష్టాలు అన్నీ.. ఇన్నీ.. కావు. ఒకట్రెండు నీటి బొట్లు మాత్రమే రావడంతో నాలుక తడుపుకుని, గొంతు ఎండబెట్టుకుని, నిరాశగా వెళ్లిపోయింది.

-కొత్తచెరువు(ఆంధ్రజ్యోతి)



దాహంతో సెలైన్ బాటిల్‌లోని ద్రావణాన్ని తాగుతున్న వానరం

ప్రాణాలతో బెట్టింగ్..!

గేమింగ్ భూతానికి బతుకులు బలి

- ఈజీమనీ వలలో చిక్కుకుపోతున్న యువత
- అప్పులు తీర్చక తనువు చాలిస్తున్న వైనం
- ఆస్తులు అమ్ముకుని ఊళ్లు వదులుతున్న బాధితులు

ఆశ చూపి.. ఊబిలోకి లాగుతున్న వైనం..



అవసరాలు తీరాలంటే డబ్బు కావాలి. ఆ డబ్బు సంపాదించుకునేందుకు ఎంచుకునే మార్గాలు చాలా ముఖ్యం. కూర్చున్న చోటే శ్రమ లేకుండా భారీగా డబ్బులు రావాలనుకుంటే జీవితం గాడి తప్పుతుంది. ఇందుకు ఆన్‌లైన్ గేములు, బెట్టింగులతో నష్టపోయిన వారి జీవితాలే నిదర్శనం. ప్రస్తుతం యువత సులభంగా డబ్బు వస్తుందనే ఆశతో ఆన్‌లైన్ బెట్టింగులు, గేమ్‌లు, పేకాటకు అలవాటు పడి అప్పుల పాలవుతున్నారు. తెలిసిన వారి దగ్గరే కాకుండా క్రెడిట్ కార్డులు, లోన్ యాప్‌లలో అప్పులు తీసుకొని ఆఖరికి అవి మెడకు చుట్టుకొని ఆత్మహత్యలకు పాల్పడి నూరేళ్ల జీవితాలను ముగిస్తూ.. కుటుంబాలను కన్నీటి సంద్రంలో ముంచేస్తున్నారు.



హిందూపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం పరిగి మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్లో క్రికెట్ బెట్టింగ్‌కి అలవాటు పడ్డాడు. రూ. 20 లక్షలకు పైగా అప్పు చేశాడు. బెట్టింగ్‌లో డబ్బులు రాలేదు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి పెంచారు. చేసేది లేక ఊరి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత ఏడాది ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా హిందూపురం పట్టణానికి చెందిన విద్యార్థి ఇంట్లో వాళ్లకు తెలియకుండా బెట్టింగ్ ఆడాడు. సుమారు రూ. 50 లక్షలకు పైగా పోగొట్టుకున్నాడు. మొదట స్నేహితుల వద్ద కొంత అప్పు తీసుకున్నాడు. అప్పటికీ కాకపోవడంతో ఇంట్లో ఉన్న స్థలాల పత్రాలను తీసుకెళ్లి తాకట్టు పెట్టాడు. బెట్టింగ్‌లో గెలవలేదు. దీంతో కుటుంబ సభ్యులకు తెలుస్తుందని రాత్రికి రాత్రే వెళ్లిపోయాడు. కుమారుడు వెళ్లిపోయాక తల్లిదండ్రులు గమనించారు. ఎందుకెళ్లాడు అని ఆరా తీయగా.. బెట్టింగ్‌కు పాల్పడి డబ్బులు నష్టపోవడంతోనే వెళ్లినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న స్థలాల పత్రాలు కనపడకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. చివరికి కుమారుడిని పోలీసులు ఎలాగోలా గుర్తించి తీసుకువచ్చారు. హిందూపురం పట్టణ పరిధిలోని వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన ప్రాంతంలో ఓ చీరల వ్యాపారి కుమారుడు గత ఏడాది బెట్టింగ్‌కి పాల్పడి రూ. కోటికి పైగా పోగొట్టాడు. ఆ యువకుడు ఇతర ప్రాంతాలకు చీరలను ఎగుమతి చేసేవాడు. వారి వద్ద డబ్బులు తీసుకొని పోగొట్టాడు. తండ్రికి తెలుస్తుందని భయంతో ఆరు నెలల పాటు ఊరొదిలి వెళ్లాడు. చీరల వ్యాపారులు ఇచ్చిన సమాచారంతో కుమారుడు బెట్టింగులు ఆడి డబ్బులు పోగొట్టినట్లు గుర్తించారు. హిందూపురం మండలంలోని ఓ రైతు కుమారుడు 2024లో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా తన పేరుమీద ఉన్న పొలాన్ని అమ్మేసి బెట్టింగుల్లో పోగొట్టాడు. కొన్నాళ్ల తరువాత బెట్టింగ్‌లో ఆస్తి పోయిందని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ కుమారుడిని వేరు కాపురం పెట్టించారు. తాజాగా ఆదివారం వెలుగుచూసిన ఘటనలో.. పరిగి మండలం పైడేటికి చెందిన జయచంద్ర అనే యువకుడు రెండేళ్లుగా పాల వ్యాపారం చేసేవాడు. కొన్నాళ్లుగా పాలు పోసే వారికి డబ్బులు సక్రమంగా ఇచ్చేవాడు. గత మూడు నెలలుగా పాలుపోసే రైతులకు డబ్బులు ఇవ్వలేదు. రైతులు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి తోడు మరో రూ. 3 లక్షలు బయటి వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. పాల వ్యాపారం ఆపేసి బెంగళూరు వెళుతున్నాను అని చెప్పి ఇంటి నుంచి బయటికి వచ్చిన ఆ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ యువకుడు.. తన షర్ట్‌పైనా, పేపర్ పైన ఎవరూ ఆన్‌లైన్ గేములు ఆడరాదని, విద్యార్థులు ఎవరూ ఆన్‌లైన్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోరాదని రాసుకున్నాడు. దీనిని బట్టి ఆ యువకుడు ఆన్‌లైన్ గేములో ఓడిపోవడం వల్లే ఇలా చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. పైన పేర్కొన్న వారే కాదు ఇలాంటి వారు ఎంతో మంది ఉన్నారు. ఇందులో బయటికి వచ్చింది కొన్ని మాత్రమే.

ఆన్‌లైన్ బెట్టింగ్.. ఒక వ్యసనం

యువత ఒక్కసారి కొంత మొత్తంలో డబ్బులు రాగానే ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్‌లకు అలవాటు పడుతున్నారు. ఇది మంచి ఆదాయ మార్గమని భావిస్తూ ఇంట్లో కూర్చునే వేలకు వేలు సంపాదించొచ్చని వారికి తెలియకుండానే అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఒక వేళ తొలుత కొద్దిపాటి లాభాలు కనపడినా ఆ తరువాత అసలైన ఆట ప్రారంభమవుతుంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు చిన్నగా లాభాలు ఇస్తూ వీలైనంత దోచుకునేలా ఉంటాయి. పోయిన డబ్బు వస్తుందని పదేపదే ఆడి మరింత పోగొట్టుకుంటూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

అప్పులు తీర్చలేక ఆత్మహత్యల వైపు..

చాలా మంది యువత బెట్టింగ్‌లు, గేమ్‌ల కోసం వడ్డీలకు అప్పులు తీసుకొని ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఇందులో నూటికి ఒకరికో ఇద్దరికో లాభం వస్తుంది. మిగిలిన వారు నష్టపోవాల్సిందే. డబ్బులు లేని వారు అప్పులు చేసి బంగారం, ఆస్తులను తాకట్టుపెట్టి ఈ విష సంస్కృతికి అలవాటు పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. దీనికి తోడు అవసరమున్నా లేకున్నా అప్పులు ఇస్తామంటూ పుట్టుకొస్తున్న యాప్‌లను చూసి యువత నష్టపోతోంది. ఇలాంటి యాప్‌లలో అప్పులు చేసి ఆన్‌లైన్ గేముల్లో పోగొట్టుకుంటున్నారు. చేసిన అప్పులు తీర్చలేక కుటుంబ సభ్యులకు చెప్పలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

బెట్టింగుల్లోకి దిగితే జీవితాలు చీకటే..

కొంత మంది యువకులు అవసరాలు, జల్సాల కోసం ఈజీమనీ సంపాదించాలని ఆశపడుతున్నారు. ఆన్‌లైన్ గేములు, బెట్టింగులకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. క్రికెట్‌ని ఆటలా చూడాలి తప్పా జూదంలా చూడకూడదు. ఆన్‌లైన్ యాప్‌ల నుంచి రుణాలు తీసుకొని ఇబ్బంది పడకండి. **- మహేష్, డీఎస్పీ, హిందూపురం**



జాగ్రత్తలే రక్ష

- వర్షాకాలంలో పిడుగులతో అప్రమత్తంగా ఉందాం ● విపత్తుల నిర్వహణ అథారిటీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్

కొత్తచెరువు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో ఇటీవల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన భారీ వర్షాలు అక్కడక్కడ కురుస్తున్నాయి. ఈక్రమంలో పశువులు, గొర్రెలు, మేకలు, మనుషులు సైతం మృత్యువాత పడుతున్నారు. రెండు రోజుల కిందట అనంతపురం జిల్లాలోని పెనకచెర్లలో పిడుగుపాటుకు గొర్రెలు మృతిచెందాయి. పిడుగు పడే సమయంలో పిడుగు పడే ప్రాంతాలపై విపత్తుసంస్థ ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్‌కు సమాచారం అందిస్తూ అప్రమత్తం చేస్తోంది. అయినా ఏదో ఒక చోట పిడుగు పాటుతో ప్రాణ నష్టం జరుగుతూనే ఉంది. అయితే కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే పిడుగు పాటు నుంచి సురక్షితంగా బయట పడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

- సాధారణంగా ఎత్తుగా ఉండే చెట్లు, భవనాలు, నిర్మాణాలపై పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. వర్షం కురుస్తున్నప్పుడు ఎట్టిపరిస్థితులోనూ ఎత్తైన చెట్లు, సెల్‌ఫోన్‌టవర్లు, విద్యుత్ స్తంభాలు, కొండల వద్దకు వెళ్లరాదు. విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి.
- సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, గేమ్‌సిస్టమ్‌లు, వాషింగ్ మేషీన్లు, కరెంటు స్టౌలు ఇతర విద్యుత్ పరికరాలు ఉపయోగించరాదు.
- వర్షం కురిసినప్పుడు వాడితే కరెంటు హెచ్చుతగ్గులతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- పొలాల్లో పనిచేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం, చెరువులలో ఉండటం, నదులు, సముద్రం, ఈత కొలనులు వంటి ప్రదేశాలకు దూరంగా ఉండాలి. గుంపుగా ఉండరాదు. ఒకరికొకరు దూరంగా ఉండాలి.
- ఉరుములతో కూడిన వర్షం వచ్చినప్పుడు నీటితో పనులు చేయరాదు. పిడుగు పడిన సందర్భాల్లో ముఖ్యంగా శరీరంపై కాలిన గాయాలు కావడం, గుండెపోటు రావడం, పిడుగుల శబ్దానికి చెవులు వినకపోవడం వంటివి జరుగుతాయి.
- ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నప్పుడు మెడవెనుక జుట్టు నిక్కపొడిచినా, చర్మం జలధరింపునకు గురైన, మెరుపు వచ్చినా పిడుగు రావడానికి సూచనగా భావించాలి. ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఉరుములు శబ్దం ఆగిన తరువాత 30 నిమిషాల వరకు ఇంటిలో ఉండాలి. కారు ఇతర వాహనాల్లో ఉంటే అన్ని డోర్‌లు మూసివేయాలి. పిడుగుల సమయంలో ఉరుములు, మెరుపులు పడే సమయంలో వర్షం వస్తే స్నానం చేయడం, చేతులు కడగడం, నీటిలో ఉండటం లాంటివి చేయరాదు. మోటారు సైకిళ్లు, ట్రాక్టర్‌లు, వ్యవసాయ పనిముట్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు వేలాడుతున్న విద్యుత్ తీగలకు ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలి. పొలాల్లో పనిచేస్తున్న రైతులు బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు పశువుల కాపర్లు, గొర్రెల పెంపకం దారులు, వర్షం సూచనలు ఉన్నప్పుడు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. లేదా రబ్బరు చెప్పులు ధరించి, చెవులు మూసుకుని మోకాళ్లపై కూర్చోవాలి. నిటారుగా ఎప్పుడు ఉండరాదు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే పిడుగు పాటు నుంచి రక్షణ పొందవచ్చునని విపత్తుల నిర్వహణ అథారిటీ మేనేజర్ టీఎస్ చేతన్ తెలిపారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన పురుషులు

కదిరిఅర్బన్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ జిల్లా పురుష, మహిళా జట్లను ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ కుమార్, మహేష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. వీరిలో ప్రతిభ కనబరచిన మహిళ, పురుషుల జట్లను ఎంపిక చేశామన్నారు. మహిళా జట్టులో మాధవి, నక్షత్ర, సభ, ఝాన్సీ రాణి, స్వప్న, షమీరా, చాందిని, లేఖన, సబ్రీబ్, ఫర్హానా, ఓంశ్రీ, పవిత్ర, సమిత, దివ్య, చందనశ్రీ, హర్షిణి, శ్రావణి ఉన్నారు. పురుషుల జట్టులో యాసిర్, డానియల్‌రాజన్, భరత్, యశ్వంత్‌నాయక్, సాధిక్‌బాషా, మహమ్మద్‌అనీఫ్, ఫైజాన్, విశ్వనాథ్, సాయికుమార్, తనయ్, కుమార్, నారాయణస్వామినాయక్, ప్రవీణ్‌నాయక్, అరుణ్‌కుమార్, మల్లికార్జున, నాగరాజులును ఎంపిక చేశామని తెలిపారు.



జిల్లా జట్టుకు ఎంపికైన మహిళలు

దూసుకొచ్చిన మృత్యువు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఒకరికి గాయాలు



ప్రమాద స్థలంలో వెంకటేష్ నాయక్, శాంతమ్మ మృతదేహాలు



శాంతమ్మ, వెంకటేశ్‌నాయక్, ప్రవళ్లిక (ఫైల్)

ఉరవకొండ, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఆదివారం రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. ఉరవకొండ-గుంతకల్లు రహదారిలో హంద్రీనీవా కాలువ వద్ద స్కూటర్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో జిల్లాలోని వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతాండాకు చెందిన వెంకటేష్ నాయక్(51), ఉరవకొండకు చెందిన శాంతమ్మ(33) మృతిచెందారు. శాంతమ్మ పుట్టినిల్లయిన వజ్రకరూరు మండలం ప్యాపిలికి పని నిమిత్తం వెళ్లింది. తిరిగి ఉరవకొండ వచ్చేందుకు ఆదివారం ప్యాపిలి క్రాస్‌కు చేరుకుని, బస్సు కోసం వేచి చూస్తోంది. అదే సమయంలో వెంకటేష్ నాయక్ స్వగ్రామం నుంచి పని నిమిత్తం ఉరవకొండకు బైక్‌పై వస్తుండగా.. లిఫ్ట్ అడిగింది. ఇద్దరూ బైక్‌పై వస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. మృతదేహాలను ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. వెంకటేష్ నాయక్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. అతడి భార్య సోమ్రుబాయి అలియాస్ లక్ష్మీదేవి ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతిచెందింది. వెంకటేష్ నాయక్ పెద్ద కుమార్తె యశోద తిరుపతిలో పీజీ చదువుతోంది. చిన్న కుమార్తె నిర్మల దివ్యాంగురాలు. తండ్రి మరణంతో వారు అనాథలయ్యారు. శాంతమ్మ భర్త వన్నూరుస్వామి ఉరవకొండలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. భార్య మరణ వార్త విని వన్నూరుస్వామి కన్నీరుమున్నీరైయ్యాడు. శాంతమ్మకు కుమారుడు ఉన్నారు.

భార్య మృతి.. భర్తకు గాయాలు

ఉరవకొండ పట్టణ పరిధిలోని చాబాల రోడ్డులో బైక్‌ను ఆటో వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో స్టాఫ్ నర్స్ ప్రవళ్లిక (31) మృతిచెందగా.. ఆమె భర్త మల్లికార్జున గాయపడ్డాడు. ఉరవకొండలోని 11వ వార్డుకు చెందిన దంపతులు పని నిమిత్తం మండలంలోని చాయపురానికి బయల్దేరారు. చాబాల రోడ్డులోకి వెళ్లగానే.. ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో గాయపడిన దంపతులను ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రవళ్లిక మరణించినట్లు వైద్యులు తెలిపారు. మల్లికార్జునకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రవళ్లిక అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తుండేవారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాలను ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదాలపై కేసులు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

పోక్సో కేసు నమోదు

చిలమత్తూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై 75 ఏళ్ల వృద్ధుడు అత్యాచారానికి యత్నించాడు. హిందూపురం డీఎస్పీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన ఏడేళ్ల బాలికను శనివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు చిరుతిళ్ల ఆశ చూపి, తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. అసభ్యకరంగా ప్రవర్తించి, అఘాయిత్యానికి యత్నించాడు. చిన్నారి ఏడ్చుకుంటూ వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు వృద్ధుడి ఇంటికెళ్లి, అతడిని పట్టుకున్నారు. పోలీసులు వచ్చి, వృద్ధుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. బాధిత చిన్నారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో జిందాల్ కార్మికుడి మృతి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామ శివారులో ఉన్న జిందాల్ కర్మాగారంలో పనిచేసే ఓ కార్మికుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మద్యం ఎక్కువగా తాగి మృతి చెందాడా..? లేక ఎవరైనా హతమార్చారా అనే విషయాలు తేలాల్సి ఉంది. విషయం తెలుసుకున్న బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్ఐ తెలిపిన మేరకు.. మృతుడు జార్ఖండ్ రాష్ట్రం ఛత్ర జిల్లా ఖర్మహీ గ్రామానికి చెందిన అభిషేక్‌బుయాన్(36)గా గుర్తించారు. అభిషేక్‌బుయాన్‌తో పాటు అతడి తమ్ముడు గణేష్‌బుయాన్ ఇద్దరూ కొంత కాలం నుంచి జిందాల్ కర్మాగారంలో పనిచేస్తున్నారు. అభిషేక్‌బుయాన్‌కు మద్యం అలవాటు ఎక్కువగా ఉందని, ఈనెల 14న వచ్చిన జీతంతో విపరీతంగా మద్యం తాగి గత మూడురోజుల నుంచి ఫ్యాక్టరీలో పనికి రాలేదని తమ్ముడు గణేష్‌బుయాన్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాపక్షపాతి చంద్రబాబు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజాపక్షపాతి అనీ, ప్రజాసంక్షేమమే ఆయన ధ్యేయమ ని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం అనంతపురం బ స్టాం డు ఆవరణలో పూల నాగరాజు కేక్ కట్‌చేసి, సంబరాలు చేసుకున్నారు. ఆ య న మాట్లాడుతూ... తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారనీ, అం దు కే ఆయన పుట్టినరోజును రాష్ట్రమంతా పండుగలా చేసుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్, కా ర్మిక పరిషత్ రీజనల్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, డి పో అధ్యక్షకార్యదర్శులు గోపాల్ చౌదరి, జయప్రకాష్, మల్లికార్జున పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పూల నాగరాజు

పండుగ వచ్చిందే..!

- మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్ విడుదల
- గత ఐదేళ్లూ నీరుగార్చిన జగన్
- మాట ఇచ్చినట్టే అమలు చేసిన కొత్త ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 811 పోస్టులు
- నిరుద్యోగులు, ఆశావహుల్లో ఆనందం
- మే 15 వరకూ దరఖాస్తులు... జూన్ 6 నుంచి పరీక్షలు

అనంతపురం విద్య, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): వచ్చిందే.. పండుగ వచ్చిందే అంటూ నిరుద్యోగులు, ఆశావహ అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత జగన్ ప్రభుత్వంలో డీఎస్సీ కోసం ఎదురు చూసి... ఆశలు ఆవిరైన అభ్యర్థులకు కొత్త ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ఇస్తామని ప్రకటన చేయడంతో సంతోషం మొదలైంది. ఇచ్చిన మాట మేరకు ఆదివారం మెగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఆశావహుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 811 పోస్టులు భర్తీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో పోస్టులు ఇలా...

నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 811 పోస్టులు భర్తీ చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖలో గవర్నమెంట్, జిల్లాపరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో 807 పోస్టులు చూపారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్స్ తెలుగు 37, హిందీ 18, ఇంగ్లిష్ 103, గణితం 43, ఫిజికల్ సైన్స్ 66, బయాలజీ 72, సోషల్ 111, ఫిజికల్ ఎడ్యుకేషన్ 145 పోస్టులు, ఎస్‌జీటీ పోస్టులు 202 పోస్టులు భర్తీ చేయనున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో 4 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను రోస్టర్ వారీగా రెండు రోజుల కిందట జిల్లా విద్యాశాఖాధికారులు కలెక్టర్ ఆమోదం తీసుకుని విద్యాశాఖ కమిషనరేట్‌కు పంపారు.

నీరుగార్చిన జగన్ సర్కారు

ఉపాధ్యాయ పోస్టుల అభ్యర్థుల ఆశలపై గత జగన్ ప్రభుత్వం నీళ్లు చల్లింది. 2019-2024 వరకూ ఈ ఐదేళ్లూ... డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ లక్షలాది మంది నిరుద్యోగులను ఊరించారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలంటూ నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు గళం విప్పినా... గొంతు నొక్కారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు, ధర్నాలు చేసినా... బలవంతంగా పోలీసులతో కేసులు పెట్టించారు. గత ఐదేళ్లూ ఇదే అరాచకం నడిపించారు. తీరా ఎన్నికల ముందు 2014లో డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ హడావుడి చేశారు. అప్పుడు కూడా బొటాబొటి పోస్టులు చూపించి, లక్షలాది మంది నిరుద్యోగుల ఓట్లను దండుకోవాలనుకున్నారు. నిరుద్యోగులు జగన్ కుట్రలను తిప్పికొట్టారు. జగన్‌ను ఎన్నికల్లో బుద్ధి చెప్పి, కొత్త సర్కారుకు గేట్లు తెరిచారు.



కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు (ఫైల్)

నిరుద్యోగుల్లో సంబరం

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే... సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీపై చేశారు. మెగా డీఎస్సీ కింద 16347 పోస్టులు భర్తీ చేస్తామంటూ సీఎం హామీ ఇచ్చారు. మాట ఇచ్చినట్టుగానే ఆదివారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించారు. దీంతో నిరుద్యోగుల్లో ఆనందం మొదలైంది. ఇప్పటికే ప్రిపరేషన్‌లో ఉన్న నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు అటు సీఎం చంద్రబాబునాయుడు, ఇటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్నారు.

గడువు పొడిగిస్తే బాగుంటుంది..

- చిన్న క్రిష్ణయ్య, డీఎస్సీ అభ్యర్థి, కర్నూలు జిల్లా



మాది కర్నూలు జిల్లా. ఇప్పటికే డిగ్రీ, బీఈడీ పూర్తి చేశా. కొన్నేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నా. గత ప్రభుత్వం అదిగో... ఇదిగో అంటూ నిరుద్యోగులతో ఆటలాడింది. చంద్రబాబు సీఎం అయిన వెంటనే మొదటి ఫైల్ కింద మెగా డీఎస్సీ ఫైల్‌పై సంతకం చేశారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో ప్రభుత్వం 16347 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చింది. చాలా ఆనందంగా ఉంది. గడువు పొడిగిస్తే బాగుంటుంది.

ఆనందంగా ఉంది

- రాజమ్మ, డీఎస్సీ అభ్యర్థి, శ్రీసత్యసాయి జిల్లా



2010-11లో బీఈడీ పూర్తి చేశా. టీచర్ పోస్టు సాధించాలన్నది నా కల. కొన్నేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నా. ప్రభుత్వం చెప్పినట్లుగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంతో చాలా సంతోషంగా ఉంది.

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూశాం..

గిరి ప్రసాద్, డీఎస్సీ అభ్యర్థి, చిత్తూరు జిల్లా



ఎంఏ బీఈడీ పూర్తి చేశాను. టీచర్ పోస్టు సాధించాలని ప్రిపేర్ అవుతున్నా. ప్రభుత్వం ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇస్తోంది. నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చేశాం. ఎట్టకేలకు ఇవ్వడం ఆనందంగా ఉంది.

పలుచోట్ల వర్షం.. నేలరాలిన పంటలు

శెట్టూరులో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, రేకుల షెడ్లు



నేలకొరిగిన అరటి పంటను చూపిస్తున్న రైతు ఓబుళరెడ్డి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. గుంతకల్లులో భారీ వర్షం కురిసింది. పుట్లూరు, శెట్టూరు మండలాల్లో వడగండ్ల వాన పడింది. గుత్తిలో ఓ మోస్తారు వర్షం, అనంతపురం, బెళుగుప్ప, యాడికి ఉరవకొండ, తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

దెబ్బతిన్న పంటలు

గాండ్లపెంట: అకాల వర్షంతో పలుచోట్ల పంటలు నేలకొరిగాయి. గాండ్లపెంట మండలంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పలు పంటలు దెబ్బతిన్నాయి. గజ్జలవాండ్లపల్లికి చెందిన ఓబుల రెడ్డి మూడున్నర ఎకరాల్లో సాగుచేసిన అరటిపంట ప్రస్తుతం కాయదశలోఉంది. ఏపుగా ఉన్న అరటి పంట నేలకొరగడంతో భారీ నష్టం జరిగింది. అలాగే అరకొరగా కాసిన మామిడికాయలు కూడా నేల రాలాయి. క్రిష్టారెడ్డి మామిడి తోటలో ఈదురుగాలలకు మామిడికాయలు రాలిపోయాయి.

తలమర్లలో పిడుగు

కొత్తచెరువు: మండలంలోని తలమర్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం టెంకాయచెట్టుపై పిడుగు పడింది. మారుతిరెడ్డి ఇంటి ఆవరణంలో ఉన్న టెంకాయచెట్టుపై పిడుగు పడడంతో కాలిపోయింది.



పిడుగు పడడంతో కాలుతున్న టెంకాయ చెట్టు

నేలకొరిగిన కాకర

తనకల్లు : మండలంలోని బొంతపల్లిలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు కాకర పంట నేలకొరిగింది. గ్రామానికి చెందిన ఆనంద్ ఒకటిన్నర ఎకరాల్లో సాగుచేసిన కాకర పంట నేలకొరగడంతో రూ.లక్ష నష్టం జరిగింది. కాకరకు నాటిన కట్టెలన్ని విరిగిపోయి, నేలకూలినట్లు రైతు ఆవేదన చెందారు.



నేలకొరిగిన కాకర పంట

గుంతకల్లులో భారీ వర్షం

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఆదివారం రాత్రి గాలి, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలైన కసాపురంరోడ్డు, ధర్మవరం గేటు పాతబస్టాండ్, గుంతబావి, తిలక్‌నగర్, బీఎస్ఎస్ కాలనీ, అంబమ్మదేవాలయం వద్ద పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరడంతో రోడ్లు జలమయమయ్యాయి. కాలువలు పొంగి రోడ్డు మీద నీరు పారడంతో చెత్త, చెదారం, బురదతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శెట్టూరులో గాలివాన బీభత్సం

శెట్టూరు: గాలివాన బీభత్సానికి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. శెట్టూరు మండలం బొచ్చుపల్లి, గొల్లలదొడ్డిలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామంలోని సన్ననాగన్న, సన్న తిమ్మక్కకు చెందిన రేకుల షెడ్డు మొత్తం గాల్లో ఎగిరింది. దీంతో ఆ గ్రామంలో ఏ నిమిషం ప్రమాదం ముంచుకొస్తుందో అని భయభ్రాంతులకు గురయ్యారు. బసంపల్లిలో ఈదురుగాలులకు అనిల్ అనే రైతుకు చెందిన బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. మారెమ్మగుడి సమీపంలో పెద్ద వృక్షం విద్యుత్ తీగలపై పడి సరఫరా ఆగిపోయింది. అయ్యగార్లపల్లిలో వడగండ్ల వర్షం కురిసింది. వడగండ్ల దెబ్బకు బొప్పాయి తోట నేలమట్టమైంది.



బొచ్చుపల్లిలో ఈదురుగాలులకు లేచిపోయిన రేకులషెడ్డు



బొచ్చుపల్లిలో పడిపోయిన విద్యుత్ స్తంభం

మాజీ ఎంపీ కేఎం సైపుల్లాకు పుత్రశోకం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేఎం జకీవుల్లా గుండెపోటుతో మృతి



జకీవుల్లా (ఫైల్)

అనంతపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు, అనంతపురానికి చెందిన కేఎం సైపుల్లాకు పుత్రశోకం కలిగింది. ఆయన తనయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేఎం జకీవుల్లా (51) హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో కేఎం జకీవుల్లా హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చేరారు. ఆయనకు వైద్య పరీక్షలు చేసిన అనంతరం స్టంట్ వేసేందుకు ఆస్పత్రి వైద్యులు నిర్ణయించారు. ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉండగానే ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉన్నఫలంగా ఆయనకు గుండెనొప్పి రావడంతో వైద్యులు వెంటనే స్పందించి వైద్యం అందించేందుకు ప్రయత్నించేలోపే జకీవుల్లా తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ సైపుల్లా బాధ వర్ణనాతీతం. ఆయనకు ఇద్దరు కుమారులైతే.. దాదాపు రెండు దశాబ్దాల క్రితం పెద్ద కుమారుడు కేఎం రహంతుల్లాను కోల్పోయాడు. ఆ బాధ నుంచి చాలా ఏళ్ల తర్వాత ఆయన కోలుకున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా 2004 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచారు కేఎం రహంతుల్లా. ఆ ఎన్నికల్లో ఓడిపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది తన రివాల్వార్‌తో కాల్చుకుని, ఆత్మహత్య చేసుకున్నారు. అయినా ఆ కుటుంబం తెలుగు దేశం పార్టీని వీడలేదు. రహంతుల్లా సోదరుడు, సైపుల్లా తనయుడు కేఎం జకీవుల్లా తెలుగు దేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన ముందుగా తెలుగుదేశం పార్టీ మద్దతుతో అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై, పనిచేశారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో ఎన్నో పదవులు చేపట్టారు. 11 ఏళ్లుగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడిగా కూడా ఆయన పనిచేశారు. ప్రస్తుతం నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గ పరిశీలకుడిగా కొనసాగుతున్నారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలోనూ కేఎం జకీవుల్లా తనదైన ముద్ర వేసుకున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీ వర్గాల్లో కేఎం జకీవుల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందనడంలో అతిశయోక్తి లేదు. పార్టీ కార్యక్రమాలే కాకుండా... పేదలకు సాయం అందించడంలోనూ ముందుండేవారు. అలాంటి నాయకుడు గుండెపోటుతో మరణించడం తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

కేఎం జకీవుల్లా గుండెపోటుతో చనిపోయాడన్న సమాచారంతో పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు.. అనంతపురంలోని కేఎం సైపుల్లా ఇంటికి చేరుకున్నారు. కుమారులు ఇద్దరిని పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంలో ఉన్న కేఎం సైపుల్లాను పలువురు పరామర్శించి, ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే, వైసీసీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, టీడీపీ నాయకులు శ్రీధర్ చౌదరి, గౌస్‌మొద్దీన్, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాయల్ మురళి, నెట్టెం వెంకటేష్, సింగవరం రవీంద్ర, బుక్కచెర్ల నల్లపురెడ్డి తదితరులు.. సైపుల్లాను పరామర్శించిన వారిలో ఉన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాల్దీవ్ పర్యటనలో ఉన్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన సతీమణి మాజీ మంత్రి కోట్ల సుజాతమ్మ ఫోన్‌లో సైపుల్లాను పరామర్శించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. కాగా కేఎం జకీవుల్లా పార్థివ దేహాన్ని అనంతపురానికి అంబులెన్స్‌లో తీసుకొస్తున్నారు. సోమవారం ఉదయం డ్రైవర్స్ కాలనీలోని ముస్లిం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



చింతకుంట హరినాథ్‌రెడ్డి(ఫైల్)

శింగనమల ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం కోసం నాలుగేళ్లు ప్రయత్నించి విఫలమైన ఓ నిరుద్యోగ యువకుడు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన చింతకుంట హరినాథ్‌రెడ్డి(29) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు.. చిన్నజలాలపురం గ్రామానికి చెందిన రైతు చింతకుంట ఆదిరెడ్డి, ఓబులమ్మ దంపతుల కుమారుడు చింతకుంట హరినాథ్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. బెంగుళూరు, హైదరాబాద్‌లో గత నాలుగు సంవత్సరాల నుంచి ఉద్యోగం కోసం ప్రయత్నించినా రాకపోవడంతో ఇంటి వద్దనే తండ్రికి వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉండేవాడు. శనివారం రాత్రి తోట వద్దకు పడుకోవడానికి వెళ్లాడు. ఉద్యోగం రాలేదనే మనస్థాపంతో అక్కడే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం పొలాల వద్దకు వెళుతున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శింగనమల ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు ఇలా మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసముద్రం మునిగిపోయారు.

మేధస్సును కదిలించేది 'శ్రమకావ్యం'

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మేధస్సును కదిలించేది 'శ్రమకావ్యం' అని ప్రముఖ సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్‌తేజ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీఐటీయూ, ఐద్వా, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో సుద్దాల అశోక్‌తేజ రచించిన 'శ్రమకావ్యం' పుస్తక గాన సభ నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత సుద్దాల అశోక్‌తేజ జీవితం గురించి సాహితీ స్రవంతి నాయకురాలు డాక్టర్ ప్రగతి వివరించారు. రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సుద్దాల అశోక్ తేజ రచనలు శ్రమ, శక్తిని చాటిచెప్పేవిగా ఉన్నాయన్నారు. శ్రమ కావ్యమే కాకుండా నేను అడవి, శూద్రగంగ వంటి రచనలు గొప్పగా ఉన్నాయని కొనియాడారు. అనంతరం సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ... శ్రమకావ్యం పుస్తకంలో శ్రమ విలువను వ్యక్తపరిచినట్లు తెలిపారు. శ్రమ అంటే మేధో శ్రమ, శారీరక శ్రమ అని రెండు రకాలుగా ఉంటాయని, ఈ రెండు కలగలిసి ప్రయాణం చేస్తుంటాయని వివరించారు. దీనినే శ్రమయాణం అనికూడా పేర్కొనవచ్చు అన్నారు. శ్రమ ద్వారానే సామాజిక గమనం ఉంటుందని శ్రమకావ్యం గానం ద్వారా ఆయన వివరించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆర్వీ నాయుడు, లింగన్న, పరమేష్, నల్లప్ప, రాంభూపాల్, ఎస్ఎం బాషా, బోస్, మానవత తరిమెల అమర్‌నాథరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలను పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఓడీసీ మండలం కొండకమర్లలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజనప్ప ఆధ్వర్యంలో, ధర్మవరం టీడీపీ కార్యాలయంలో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి ఆధ్వర్యంలో, కొత్తచెరువులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. అలాగే ముదిగుబ్బ, ఎన్పీకుంట, తనకల్లు, ఓడీసీ, గాండ్లపెంట, తాడిమర్రి, బత్తలపల్లి, బుక్కపట్నం, నల్లమాడ మండల కేంద్రాల్లోనూ ఈ వేడుకలను టీడీపీ నాయకులు చేపట్టారు. పలు ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.


కొండకమర్ల : కేక్ కట్ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప


ధర్మవరం : ప్రభుత్వాస్పత్రి వద్ద టీడీపీ నాయకుల అన్నదానం


కొత్తచెరువు : కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి పల్లె


ముదిగుబ్బ: కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


ఎన్పీకుంట : వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు


తనకల్లు : అంబేడ్కర్ సర్కిల్‌లో..


ఓడీసీలో..


గాండ్లపెంటలో..


తాడిమర్రిలో..


బత్తలపల్లిలో టీడీపీ కార్యాలయం వద్ద..


బుక్కపట్నం: కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


నల్లమాడలో..

విశిష్ట గడువు ముగుస్తోంది..!

- లక్ష్యానికి దూరంగా యూనిక్ నంబర్ నమోదు
- గడువు పొడిగించినా.. మందకొడిగా..
- రైతుల్లో అవగాహన లేమి


రైతుల వివరాల నమోదు చేస్తున్న అధికారులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ తరహాలో 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రి య ఫిబ్రవరిలో పూర్తి చేయాల్సి ఉంది. అయి తే సాధ్యం కాకపోవడంతో ఆ గడువును ఈ నెల చివరి వరకూ పెంచారు. కానీ ఏప్రిల్ మూడో వారం వచ్చినా ఆ ప్రక్రియ మందకొడిగానే సాగుతోంది. రైతుల మంచి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు, పంటల బీమా తదితరాలు పొందడానికి ఈ విశిష్ట సంఖ్య చాలా ఉపయోగపడుతుంది. ముదిగుబ్బ మండలంలో అర్హులైన రైతులు 17 వేల మందిని గుర్తించగా, ఇప్పటికి 13,185 మందికి విశిష్ట సంఖ్య నమోదు పూర్తి అయింది. ఇంకా 3,815 మంది ఈ సంఖ్య పొందాల్సి ఉంది.

● ఇవే కారణాలు ...
కొందరు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం, భూ యజమానులు మరణిస్తే వారసులు పేరు మార్చుకోకపోవడం, ఆధార్ సంఖ్యతో అనుసంధానం కాకపోవడం, విశిష్ట సంఖ్య నమోదుపై కొంతమంది రైతులకు అవగాహన లేకపోవడం.. తదితర సమస్యలతో నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఈ నెలతో ముగిసే గడువులోగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు చెబుతున్నారు.

● ఈ ఆధారాలుంటే చాలు...
భూమి ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం నకలు, ఆధార్‌తో లింక్ అయిన సెల్‌ఫోన్ నెంబరు వివరాలను రైతు సేవా కేంద్రాల్లో వీఏఏతో నమోదు చేయించుకోవాలి. భూ యజమానులు ఈ సేవా కేంద్రాలకు వెళ్లకపోతే ఓటీపీ ఆధారంగా నమోదు చేసుకోవచ్చు.

రైతులకు అవగాహన కల్పించాలి



విశిష్ట సంఖ్య నమోదుపై రైతులకు మరింత అవగాహన కల్పించాలి. విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియ గురించి చాలా మంది రైతులకు అవగాహన లేదు. దీంతో విశిష్ట సంఖ్య నమోదు ఇంకా చేయించుకోలేదు. వీటి వలన ప్రభుత్వ పరంగా ఏఏ పథకాలు అందుతాయి, ఎలాంటి లబ్ధి చేకూరుతుంది.. తదితర అంశాలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

- వెంగమేష్ చౌదరి, జాతీయ మానవ హక్కుల దక్షిణ రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు, ముదిగుబ్బ

అన్నింటికీ కీలకం

భవిష్యత్తులో విశిష్ట సంఖ్య కీలకంగా మారనుంది. సాగుభూమి ఉన్నవారందరూ విధిగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. ప్రభుత్వ పరంగా ఏ పథకం వర్తించాలన్నా ఇది అవసరం. రైతు సేవా కేంద్రాల్లో రైతుల పేర్లను నమోదు చేస్తారు. ఈ విషయంలో రైతులు త్వరపడాలి. గడువు దగ్గరకు వస్తోంది.

- లక్ష్మీ నరసింహులు, మండల వ్యవసాయాధికారి


ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన ప్రకాష్

వైసీపీ మాజీ కన్వీనర్ టీడీపీలో చేరిక

కదిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ రూరల్ మండల మాజీ కన్వీనర్ కటికల ప్రకాష్ వైసీపీ వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అతనికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారు. ఆయన పది సంవత్సరాల పాటు వైసీపీలో రూరల్ కన్వీనర్‌గా పనిచేశారు. ఆయన కుటుంబ సభ్యులు ఎంపీటీసీగా, నీటిపారుదల శాఖ డైరెక్టర్‌గా పనిచేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలో చేరినట్లు ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల కన్వీనర్ చెన్నకేశవులు, నాయకులు ఓరాది చంద్ర, పీవీఆర్ గణేష్, మనోహర్, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్


వెంగళమ్మచెరువు చర్చిలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం ఘనంగా పునరుత్థాన (ఈస్టర్) పండుగను నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వెంగళమ్మచెరువు హోలీసిటీ చర్చిలో పాస్టరు మైకేల్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.
● ఓబుళదేవరచెరువు : స్థానిక సీఐఅండ్ఐజీ మిషన్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి బాలరాజు, సభ్యులు సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

'మానికమ్మ శతకం' ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ

బుక్కపట్నం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు మాణిక్యం ఇసాక్ రచించిన మానికమ్మ శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని అదే పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఇందులో డీఈఓ కిష్టప్ప, ఆపస్ జిల్లా అధ్యక్షుడు అమర చంద్రబాబు మాట్లాడుతూ.. మంచి రచనలతోనే మానవత్వం విలువలు పెంపు సాధ్యమన్నారు. కార్యక్రమంలో భావన ప్రియ సాహితీ అధ్యక్షుడు చక్రవర్తి, చత్రపతి సాహితీ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు రాయపాటి శివయ్య, ప్రధానోపాధ్యాయులు జగదీష్, జనార్దన్, నరసింహయ్య గుప్తా, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, పీడీ నాగరాజు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కమిటీ సమావేశం

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ కమిటీ సమావేశాన్ని స్థానిక గణేష్ కూడలిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఇందులో జిల్లా గౌరవాధ్యక్షుడు వేమయ్యయాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం కాకుండా కార్పొరేట్లకు కొమ్ముకాసేలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలు చాలా ఉన్నాయని, వాటిని పరిష్కరించడంతో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఇందులో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సురేంద్రచౌదరి, నాయకులు బాబు, మధునాయక్, రమేష్, సంపూర్ణమ్మ, వెంకటేష్, రమణ, జయలక్ష్మీ, మారుతిరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వేమయ్య యాదవ్

క్రైం న్యూస్ ..

గుండెపోటుతో నిరుద్యోగి మృతి


రమణ (ఫైల్)

తనకల్లు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌కు చెందిన నిరుద్యోగి రమణ (33) గుండెపోటుతో మరణించాడు. జమున, చలపతి బెల్దారి పనులు చేస్తూ కుటుంబానికి పోషించుకునేవారు. వారికి ఇద్దరు కుమారులు. వారిని బీఈడీ చదివించారు. గత ప్రభుత్వ పాలనలో ఐదేళ్ల డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూశారు. నూతన ప్రభుత్వం అధికారం చేపట్టడంతో.. నోటిఫికేషన్ కోసం ఎదురు చూశారు. శనివారం రాత్రి రమణకు గుండె పోటు రావడంతో వైద్యం కోసం మదనపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లాలని సూచించారు. బంధువులు అతన్ని తిరుపతికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించాడు. కాగా రమణ అవివాహితుడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు ..


జగదీష్‌రెడ్డి (ఫైల్)

నంబులపూలకుంట, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌకనపేటకు చెందిన లారీడ్రైవర్ జగదీష్‌రెడ్డి (33) ఆదివారం తెల్లవారుజామున కర్నూల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రాజారెడ్డి, సుబ్రమ్మ కుమారుడు జగదీష్‌రెడ్డి లారీ యజమాని, డ్రైవర్. పామిడి నుంచి మహారాష్ట్రకు వండ్లు లారీలో తీసుకెళ్తుండగా.. కర్నూల్ సమీపంలోని ఎర్రబల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. జగదీష్‌రెడ్డి అవివాహితుడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

షాదీమహల్‌ను అందుబాటులోకి తెస్తాం

కొత్తచెరువు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పెనుకొండ రహదారి పక్కన ఉన్న షాదీమహాల్‌కు త్వరలోనే మరమ్మతులు చేపట్టి.. కుల మతాలకు అతీతంగా అందుబాటులోకి తెస్తామని మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా తెలిపారు. ఆదివారం స్థానిక షాదీమహల్‌లో ఆయన మాట్లాడుతూ.... ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సహకారంతో మస్తాన్‌వలీ దర్గా కమిటీ ఛైర్మన్‌గా తనను ఎంపిక చేశారన్నారు. వారి సహకారంతో అనేక ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న షాదీమహల్‌కు మరమ్మత్తులు చేయించి త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. బుక్కపట్నం రహదారిలోని మస్తాన్ వలీ దర్గాకు ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గదులకు త్వరలోనే బహిరంగ వేలం పాట నిర్వహించి.. వచ్చే డబ్బులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.


మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా

రోడ్లపై మురుగునీరు ..

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ శ్మశాన వాటిక సమీపంలోని వీధుల్లో 15 రోజులుగా మురుగునీరు నిల్వ ఉంటోంది. దీనిపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. మురుగునీటి దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేకుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామన్నారు.


కోకనట్ గ్రూవ్ సమీపంలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు

నేడు శాంతి ర్యాలీ

ధర్మవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసనగా సోమవారం ధర్మవరం సంయుక్త మసీద్ కమిటీల ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహిస్తామని ముస్లిం మైనార్టీలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ర్యాలీ ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని, కావున ఉదయం 9 గంటలకే జామియా మసీదు వద్దకు చేరుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

వైద్య శిబిరానికి భారీ స్పందన

ధర్మవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక స్పందన ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత జనరల్ సర్జరీ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ నేతాజీ లాప్రోస్కోపిక్ సర్జన్ ఆధ్వర్యంలో 24 మందికి ఉచితంగా పరీక్షించి మందులు అందజేశారు. అదేవిధంగా షుగర్ పరీక్షలూ నిర్వహించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అనుమతి వచ్చిన వారికి పూర్తిగా ఉచితంగా ఆపరేషన్లు, పథకాలు లేని పేదలకు రాయితీతో ఆపరేషన్లు నిర్వహిస్తామని స్పందన ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్లు బషీర్, సోనియా తెలిపారు.

రేపటి నుంచి ఆర్సీపీ రాష్ట్ర మహాసభలు


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్సీపీ నాయకులు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆర్సీపీ రాష్ట్ర మహాసభలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కదిరిలో నిర్వహిస్తున్నామని, వాటిని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి నాగప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో మహాసభలపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్జల శేఖర్, సుగుణమ్మ, అరుణ్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయండి

ధర్మవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఒప్పంద అధ్యాపకులతో గత సంవత్సరం మే నెలలో అడ్మిషన్ డ్రైవ్, తరగతుల నిర్వహణ, సప్లమెంటరీ పరీక్షల విధులు, మూల్యాంకనం విధులు చేయించుకున్నారని, కానీ వేతనం మాత్రం ఇంతవరకూ విడుదల చేయలేదని ఒప్పంద అధ్యాపకుల సంఘం జిల్లా నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు నెలల క్రితం మే నెలకు సంబంధించిన జిల్లాల వారిగా, కళాశాలల వారిగా వర్క్‌డన్ కూడా తీసుకున్నారన్నారు. ఇంతవరకు విద్యా సంవత్సరం ముగిసినా కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైన గత సంవత్సరం మే నెల జీతం విడుదల చేయలేదన్నారు. ఈ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఆ సంఘం నాయకులు పెద్దన్న, రమణారెడ్డి, చాంద్ బాషా, మురళీనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సొసైటీ గోల్డెన్ జూబ్లీ సమావేశం


మాట్లాడుతున్న రవీంద్రారెడ్డి

ధర్మవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మున్సిపల్ టీచర్స్ క్రెడిట్ సొసైటీని స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక కోటా స్కూల్‌లో సొసైటీ గోల్డెన్ జూబ్లీ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆ సొసైటీ అధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. నాడు మున్సిపల్ టీచర్లకు రూ.500 రుణ సౌకర్యంతో ప్రారంభమై.. నేడు రూ.3 లక్షల వరకు రుణ సదుపాయాన్ని కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యవర్గ సభ్యులు రమేశ్‌బాబు, అమానుల్లా, రాంప్రసాద్, అంజినాయక్, రాంప్రసాద్, లక్ష్మీనారాయణరెడ్డి, ఇతర మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ నారాయణరెడ్డి

కదిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజున పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ నారాయణరెడ్డి మాట్లాడారు. అత్యవసర సమయంలో 100, 112ను సంప్రదించాలన్నారు. ఇందులో ఇన్‌ఛార్జీ అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్, టీడీపీ ఇన్‌ఛార్జి ఇమ్రాన్, బీజేపీ నాయకుడు ఉత్తమరెడ్డి, పశువైద్యాధికారి శ్రీరాములనాయక్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. తనతోపాటు అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ నరసింగప్ప

గోరంట్ల, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌ను పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప ఆదివారం తనిఖీ చేశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన మొదటిసారి గోరంట్ల పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి సీఐ శేఖర్‌తో చర్చించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, నేరాల సంఖ్య, పరిష్కారం, శాంతి భద్రతలు తదితరవాటిపై ఆరా తీశారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

మడకశిర టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రం వద్ద విద్యార్థులకు మాక్‌డ్రిల్ నిర్వహించి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి విజయ్‌కుమార్, డాక్టర్ జంషీర్ పాల్గొన్నారు.

మిత్రుడి జ్ఞాపకార్థం అన్నదానం



అన్నదానం చేస్తున్న మిత్రబృందం

గోరంట్ల, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మిత్రుడు మృతిచెందగా అతడి మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ తోటిమిత్రులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండాలబండ వీధికి చెందిన బొక్కసం శ్రీనివాసులు (31) ఈయేడాది ఫిబ్రవరి 11న మృతిచెందగా బస్టాండ్ ప్రాంతంలో మిత్రుడి ఫోటో, ఫ్లెక్సీ ఏర్పాటు చేసి అతడిపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. బాబ్‌జాన్, వినోద్, ఈశ్వర్, సుందరేష్, యోగానంద్, ఉస్మాన్, బాలా, వెంకటాద్రి, సుధ, శీనా, మురళీ తదితరులు అన్నదానంచేశారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

మడకశిర టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఅండ్ఐజీఎం చర్చిలో ఆదివారం ఈస్టర్‌ను ఘనంగా జరుపుకున్నారు. చర్చిని రంగురంగుల పూలతో అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ షాలేందాస్ ఏసుప్రభు సందేశాలను చదివి వినిపించారు. వేడుకల్లో క్రైస్తవులు పాల్గొన్నారు.



దైవసందేశం వినిపిస్తున్న పాస్టర్ సుధాకర్

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): స్థానిక బైబిల్ మిషన్‌చర్చిలో పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఈస్టర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా నీతిమార్గంలో నడవాలని సూచించారు.

పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు



పురవీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

సోమందేపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కమిటీ సభ్యులు ఊరేగించారు. ఉగాది పండగ ముగిసిన నెల తరువాత కార్యక్రమాన్ని చేపట్టడం ఆనవాయితీ. తొగటవీరక్షత్రియ ఆరాధ్య దైవమైన అమ్మవారి ఊరేగింపు ధర్మకర్త ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో వీరే కేశవయ్య, వీరే మారుతి, గట్టా మహేంద్ర, నరసింహులు, శివకుమార్, మూర్తి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

బోరు వేయించిన టీడీపీ నాయకులు

సోమందేపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఆదివారం వినాయకనగర్ మార్కెట్‌రోడ్డులో టీడీపీ నాయకులు బోరు వేయించారు. చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరుగంటి చంద్ర, సూరీ, కిష్టప్ప, తూమకుంట బాలు, జక్కా చంద్ర, తూమకుంట నాగరాజుయాదవ్, రామాంజి, ముత్తప్ప, సజ్జరాయుడు, నరేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



గంగమ్మకు జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి సవిత

గోరంట్ల, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మలవాండ్లపల్లిలో చెరువుకట్ట గంగమ్మ జాతర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కమ్మలవాండ్లపల్లి, భగవంతంపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో జాతర జరిగింది. మహిళలు జ్యోతులు తీసుకురాగా రామాలయంలో పూజలుచేసి, గంగమ్మగుడివద్దకు ప్రదర్శనగా వెళ్లారు. చెరువు కట్టపై కొలువైన గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి శాంతి పూజలు చేశారు. అనంతరం సొప్పలమ్మ, సోలాపురమ్మ, సుంకులమ్మతోపాటు ఐదుమంది గ్రామ దేవతలకు జ్యోతులతో ప్రదర్శనచేసి పూజలు చేశారు. వర్షాలు కురిసి పాడిపంటలలో ప్రజలు ఆరోగ్యంగా సుఖంగా ఉండేలా చూడాలని అమ్మవారిని ప్రార్థించారు. మంత్రి సవిత, టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.11.90 లక్షల చెక్కులను మంత్రి సవిత ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. రొద్దం, పరిగి, సోమందేపల్లి మండలాల బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో అడదాకులపల్లి ప్రసాద్, సిద్దయ్య, రఘు, రామలింగ పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1985-90సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు సుమారు 80మందిదాకా పాఠశాలకు చేరుకుని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వారు చదివిన పాఠశాల గదులు, ఆడిన ఆటస్థలం చూసి తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, రామచంద్ర, ప్రస్తుత హెచ్‌ఎం నాగార్జునలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జనార్దన్‌రెడ్డి, చిన్నపరెడ్డిపల్లి రాము, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

రొద్దం నుంచి పావగడకు పాదయాత్ర

- సంఘీభావం తెలిపిన మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రొద్దం మండల కేంద్రంలో పెద్దాంజనేయస్వామి ఆలయం నుంచి పావగడ శనైశ్వర ఆలయం వరకు భక్తులు పెద్దఎత్తున పాదయాత్ర నిర్వహించారు. ఆదివారం ఉదయం 5గంటల నుంచి రొద్దంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించగా గ్రామంలోని మహిళలు పెద్దఎత్తున పాదయాత్రకు తరలివచ్చారు. సీత, రామ, లక్ష్మణ విగ్రహాలను ట్రాక్టర్‌లో ఉంచి ర్యాలీగా వెళ్లారు. ప్రతి రెండేళ్లకోసారి పాదయాత్ర చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సంఘీభావం తెలిపారు.



రొద్దంలో పాదయాత్రలో సంఘీభావం తెలుపుతున్న మంత్రి సవిత

మెరుగైన వైద్యసేవలు అందించండి

పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్



ఆసుపత్రి వైద్యులతో ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ సూచించారు. ఆదివారం పట్టణంలోని నూతన బస్టాండ్‌లో ఉన్న నమ్మ ఆరోగ్య క్లీనిక్ ప్రారంభోత్స కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డబ్బు సంపాదించడం కన్నా పేరు తెచ్చుకోవడం గొప్పవిషయమన్నారు. మంచి వైద్యం తక్కువ ఖర్చుతో అందించి ప్రజల మన్ననలు పొందాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ మాజీ ఉపాధ్యక్షులు నాగమణి, నారాయణప్ప, డాక్టర్ భరత్, రామచంద్ర, డాక్టర్ ఆర్య, బాలాజీ, మనోజ్ హాజరయ్యారు.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రవీణ్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి నివాసంలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. 140మంది మహిళలకు 90రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, రవినాయక్, నారాయణస్వామి, నాగమణి, అశోక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

దంపతులకు గాయాలు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని ఎల్‌జీబీ నగర్ సమీపంలోని సబ్ స్టేషన్‌వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. లోచర్ల గ్రామానికి చెందిన నరసింహమూర్తి భార్య వర్షిణి ద్విచక్రవాహనంలో పనినిమిత్తం ధర్మవరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎల్‌జీబీనగర్ సమీపంలోకి రాగానే పావగడవైపు నుంచి పెనుకొండ వైపు వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వర్షిణిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.



గాయపడిన వర్షిణిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల కేటాయింపు ఒకేలా ఉండాలి

పెనుకొండ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాసంస్కరణలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రైమరీ పాఠశాలలపై వివక్షత చూపకూడదని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షకార్యదర్శులు మారుతిప్రసాద్, జయక్రిష్ణ, నరేష్‌కుమార్, మక్కిచెట్టికుమార్, ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల కేటాయింపులో సమానత ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు.

పొలంలో పిడుగు



దగ్ధమవుతున్న గుడిసె

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేబండ గ్రామ వ్యవసాయ పొలంలో పిడుగు పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థుడు పోతిరెడ్డి అందించిన సమాచారం మేరకు దుద్దేబండ గ్రామ సమీపంలో బోయవాళ్ల బావివద్ద రైతులు కొట్టాలు వేసుకుని వ్యవసాయ పనులు చేసుకుని తిరిగి సాయంత్రం యథావిధిగా ఇంటికి తిరిగివచ్చేవారు. ఈ క్రమంలో ఉన్నపళంగా కొట్టంపై పిడుగు పడటంతో ఒక్కసారి భయాందోళనకు గురయ్యారు. రైతు నారాయణకు చెందిన గుడిసెపై పిడుగు పడటంతో దగ్ధమైంది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

జూదరుల అరెస్ట్

రొళ్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎంరాయపురం పంచాయతీ చెర్లోపల్లి సరిహద్దులో పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టుచేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సమాచారం అందిన మేరకు ఆదివారం తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.72,880 నగదు స్వాధీనంచేసుకుని కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ రామలింగప్ప, కానిస్టేబుల్ షఫీవుల్లా, దిలిప్, వన్నప్ప, రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు అభినందన సభ

పావగడ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జలయజ్ఞ సమితి ఆధ్వర్యంలో తుంగభద్ర నీరు వచ్చేందుకు కృషి చేసిన వారికి సోమవారం సన్మానం చేయనున్నట్లు జలయజ్ఞ సమితి అధ్యక్షుడు శివప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప వెల్లడించారు. ఉదయం 10 గంటలకు గురుభవన మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం ఎస్ఎస్‌కే రంగ మందిరం వద్ద సభ ఉంటుందన్నారు.

'మానికమ్ము శతకం' ఆవిష్కరణ

బుక్కపట్నం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు మాణిక్యం ఇసాక్ రచించిన మానికమ్ము శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని అదే పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఇందులో డీఈఓ క్రిష్టప్ప, ఆపాస్ జిల్లా అధ్యక్షుడు అమర చంద్రబాబు మాట్లాడుతూ.. మంచి రచనలతోనే మానవత్వం విలువలు పెంపు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బావనప్రియ సాహితీ అధ్యక్షుడు చక్రవర్తి, చత్రపతి సాహితీ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు రాయపాటి శివయ్య, ప్రధానోపాధ్యాయులు జగదీష్, జనార్థన్, నరసింహయ్యగుప్త, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, పీడీ నాగరాజు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పట్టణంలో వాడవాడలా, పల్లెల్లో తెలుగుదేశం నాయకులు చంద్రబాబు చిత్రపటం వద్ద కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంచారు.



పరిగి మండలం కొడిగెనహళ్లి పంచాయతీ బిందూనగర్‌లోని వృద్ధాశ్రమంలో టీడీపీ నాయకుడు సోమప్ప ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ పాల్గొన్నారు.



మడకశిర పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, కార్యదర్శి శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, కన్వీనర్ లక్ష్మీనారాయణ



చిలమత్తూరులో కేక్ కట్ చేస్తున్న మండల కన్వీనర్ రంగారెడ్డి, దేమకేతేపల్లి అంజినప్ప, బేకరీ గంగాధర్ తదితరులు



అగళిలో కేక్ కట్‌చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్



కొటిపిలో వాణిజ్య విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచల్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేశారు. పూలకుంటలో సర్పంచ్ మంజునాథ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



రొళ్లలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, ఎస్సీసెల్ నేత కృష్ణమూర్తి తదితరులు



మడకశిర మండలం గుండుమలలో మాజీ సర్పంచ్ చంద్రప్ప ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుక చేసుకుంటున్న నాయకులు

పీఎం, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

పెనుకొండ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కల నెరవేర్చిన ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో పూలమాలలువేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జన్మదినం సందర్భంగా కేక్‌కట్‌చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎనుమల రామక్రిష్ణ, సీనియర్ నాయకుడు రామాంజినేయులు, ఎమ్మార్పీఎస్ నాయకులు దండోర రామాంజినేయులు, పెద్దన్న, రాంబాబు, పోతులయ్య పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు